ఉచ్చు

పంచాయితీ ఆఫీసు వరండాలో మెత్తని కుర్చీమీద కూర్చున్న వ్యక్తి రామిరెడ్డి. అతడు ఆ వూరి సర్పంచ్. అతని కటువైపూ యిటువైపూ కుర్చీల మీదా, బెంచీ మీదా, కూర్చున్నవారిలో ఇద్దరు పంచాయితీబోర్డు మెంబర్లుగాక,మరో ముగ్గురు ఆ వూరి పెద్ద మనుషులనబడే వారు కూడా వున్నారు. వారక్కడ కూర్చొని దాదాపు గంటయింది. వారందరూ చాలా అసహనంగా ఉన్నారు. ... కోపంగా ఉన్నారు... మాట్లాడిస్తే కరిసేలా వున్నారు.

రామిరెడ్డి దవడలు విచిత్రంగా కదలుతున్నాయి. అతడు కోపంగా వున్నాడనటానికి అదే సాక్ష్యం.... ఒకటి మీద ఒకటి వరుసగా సిగరెట్లు కాలుస్తున్నాడు. అలా వరుసగా సిగరెట్లు కాల్చడమంటే అతడు విసుగ్గా ఉన్నట్టు లెక్క. ఎడం ప్రక్కన కుర్చీలో కూర్చున్న పెద్దారెడ్డి నోటి నిండా నమిలిన తాంబూలాన్ని కొంత దిగమింగి, "ఈనాకొడుకుల్ని యాటికి పంపినా ఇంతే " అని కక్కసించాడు. ఆ పోయిన "ఈ నా కొడుకులు' ఆవూరి వెట్టాడూ, తలారోడూ. పెద్దారెడ్డి ఆ వూరి మునసబు, వెట్టినీ, తలారినీ, అతడెప్పుడూ ".... నా కొడుకు'లనే సంబోధిస్తుంటాడు. కుడిప్రక్కన కూచున్న శివరామప్ప జేబులోంచి దుగ్గు పొగాకు తీసి యింత నోట్లో వేసుకొని "ఈ నాయాళ్ళంతగా బలిసిపోయినారప్ప! మీరేమన్నా అనండి. యాటికాటికి కీళ్ళిరగదంతా వుంటేనే మాటలినేది...." అన్నాడు బజారువేపు చూస్తూ. ఆ మాటకి రామక్రిష్టయ్యా పళ్ళిగిలించి నవ్వాడు.

"ఇంతకూ ఆ కర్రోడు కొంపకాడ వుండాడో లేదో" అనుమానాన్ని వ్యక్తం చేశాడు సుబ్బన్న,

"వానికి నిన్న యియ్యాలప్పుడే చెప్పి పంపినా, రేపు పంచాయితీకి వచ్చి యా సంగతీ చెప్పుకోమని.... ముసిలోడైనా బోసీలుగుడు నాకొడుకులే" అన్నాడు. అక్కడ వీరందర్నీ సమావేశ పరచిన వెంకటరెడ్డి.

"అదిగో.. రానే వస్తావుండారు... రానీ... రానీ నా కొడుకులు... యింత సేపట్నుండీ యాడ గాడుదులు కాస్తా వుండారో....." అంటూ లేచి నిలబడ్డాడు పెద్దారెడ్డి.

వెట్టి, తలారీ, వారిద్దరి వెనకాల కర్రోడు, కర్రోని పెండ్లాము మల్లక్క, వరండా ముందుకు చేరుకున్నారు.

“ఇంతసేపేం జేస్తావుండార్రా దొంగ నా కొడుకుల్లారా.. ఈ దుండే మాదిగిండ్ల కాడికి పొయ్యేకి గంట సేపా.... ” అని గద్దించాడు పెద్దారెడ్డి.

“ఈ ముసిలోడు కొంపకాడుంటే గదా సామీ! శేనికాడుండాడని కొల్లా పురిగాడు సెప్తే అక్కన్నుండి నేరుగా శేనికాటికి పొయ్యినాం” వినయంగానే విన్నవించుకున్నాడు తలారి.

“ఈ పొద్దు పంచాయితీ వుందని చెప్తే శేనికాడేం పనిరా నీకు? నువ్వు చేసిండే బాడ్కావు పనికి నీకోసం మనుషుల్ని గంటల తరబడి పంపల్లా మేము?” అంటూ కర్రోన్ని అరిచాడు వెంకటరెడ్డి.

‘లేదు సామీ లేదు. పద్దన్నే ఒగసారి యాటికొచ్చే పొయ్యినా, ఇంగా మీరెవురూ యాటికి రాకపోతే, ఒగసారి శేను తిరగేసుకొద్దామని....” అంటూ దుప్పటి తీసి నేలమీద గుజ్జుగా వేసుకొని దానిమీద కూచున్నాడు కర్రోడు. అతని పక్కన అతని భార్య మల్లక్క కూచొని, చేతులు మోకాళ్ల మీద ఆన్చి, వాళ్లవైపు నిశ్శబ్దంగా చూసింది.

వెట్టినీ, తలారీనీ ఏదో పని పురమాయించి పంపించేశాడు పెద్దారెడ్డి.

రామిరెడ్డి చూపు కర్రోడి మీద పడింది... “ఏం రా కర్రోడా” అని పిలిచాడు. తను అడగబోయే విషయానికి వుపోద్ఘాతంలా. రామిరెడ్డి కంటె కర్రోడు నిజానికి పదేళ్లు వయసులో పెద్దవాడు. రామిరెడ్డి నాయన కూడా “ఒరే కర్రోడా” అని పిలిచేవాడు. ఇప్పుడు ఈయప్ప కూడా అట్లాగే పిలుస్తున్నాడు. కర్రోడు కారు నలుపు. అసలు పేరు నాగన్న. నల్ల నాగన్న చిన్నప్పుడే కర్రోడయ్యాడు. ఓటర్ల లిస్టులో కూడా అతని పేరు కర్రోడే. అసలు కర్రోడికే తన పేరు నాగన్న అని గుర్తులేదు.

కర్రోడి వయసిప్పుడు అరవై దాటుతోంది.... వంగిన దబ్బలా వుంటాడు. చివికి పారేస్తే ఎండిపోయిన నేరేడు పిచ్చిలా వుంటాడు. పుల్లలకు చెక్కిన వుల్లి గడ్డలా వుంటాడు. చర్మం అతికించిన అస్థిపంజరంలా వుంటాడు. అతని వీపు మీదున్న వెన్నుపూసల్ని యిప్పుడు ఒక్కటి కూడా తప్పుబోకుండా ఖచ్చితంగా లెక్కబెట్టవచ్చు.

కర్రోడు రామిరెడ్డి ముఖంలోకి, యింకా అక్కడ కూచున్న అందరి ముఖాల్లోకి చూశాడు.

“నీ కొడుకు కథ ఏమన్నా తెలిసిందా?” అడిగాడు రామిరెడ్డి.

"అంతలక్కా యిశారిచ్చినా సామీ! యాడ కొల్లపోయినాడో ఏమో.... ధర్మారం దగ్గిర రేగాటి పల్లి క్కాడ పుల్లిగాన్ని పంపిచ్చినా.... వాళ్ళ అక్కయ్య దగ్గర కేమైనా పొయ్యినాడేమోనని.... ఆటికి వురువు రాలేదంట...." అన్నాడు కగ్రోడు.

"నీదంతా నాటకం లేవోయ్. లేకపోతే యిన్నాల్లయింది నీ కొడుకు నీకు తెలీకుండా యాటికి పొయ్యుంటాడు...." అన్నాడు సుబ్బన్న తానొక బీడీ వెలిగించుకొని, ఒక బీడీని అగ్గిపెట్టెనూ కగ్రోని ముందుకు విసిరేస్తూ.

"ఒట్టు నాయన్నా.... నా కంత పానంమింది కేమొచ్చింది" అని. తన ముందు పడ్డ బీడీని తొగ్రినోట్లో పెట్టుకొని, చాలా నిదానంగా అగ్గి పెట్టెలోంచి పుల్ల తీసి వెలిగించుకున్నాడు.

"వాడే పొద్దూ సెప్పకుండా వూరిడిసి నోడు గాదు..... యాడేడ యే మవత్తులు పడతండాడో అని మేము "కుయ్యో.... మొగ్రో...." అనుకుంటూంటే మీ కత మీది... మా పిల్లోని బాదలో మేముంటే మీరిట్లంటే ఎట్లయ్యా" అంది మల్లక్క.

"నీ కొడుకు బాధ నువ్వు సెప్పుకుంటే, యివతల యెంగట్రెడ్డి సంగతి యేం సేయల్లనుకుండావ్! ఏదో మంచి పిల్లోడు, పనీ పాటా బాగాసేస్తాడని గదా జీతానికి పెట్టుకొని ఐదు నూర్లు ముందుగానే యిచ్చింది. వాడింగా పన్లోకి సేరి నెలగూడా దాటకుండానే గుమ్ముకొని పోతే యిక్కడ పనెట్ల జరగల్ల.... మీ కిదేమన్నా పట్టిందా వూరికే నా కొడుకో నా కొడుకో అంటే సరిపాయనా...." అన్నాడు శివరామప్ప.

"నువ్వు సెప్పింది రైటే సామీ! వాడు జరమొచ్చి రెండ్రోజులు మల్లుకుంటే మూడోనాడు సింతసెట్టు కింద పండుకున్నోన్ని యాటికి పడితే యాటికి ఈయప్ప, యంగట్రెడ్డి యెగిచ్చి యెగిచ్చి తంతే, వాడు కొంపక్కాడా రాకుండా అదే పోత– జరంమీద అన్ని దెబ్బలు పడితే వాడు మాత్రం తట్టుకుంటాడా! ఆ పొద్దుట్నుండీ ఇది వొగటే ఏడుపు.... యాడ పోయినాడో, యెట్టుండాడో అని... బందుగుల వూర్లన్నీ యెతికిచ్చినాము. దీంట్లో తప్పేమన్నా వుందా నాయన్నా. ఈయప్ప కొట్టకుండా వుంటే మావాడు వూరిడిసేవాడేనా! వానికేమన్నా అయ్యుంటే యా దేవున్తో చెప్పుకోవల్ల...." అంటుండగా కగ్రోని కంఠం వణికింది. కళ్ల మీద నీటిపొర కమ్ముకుంది. మణికట్టుతో కళ్ళను తుడుచుకున్నాడు.

'వో యబ్బ యీ మాత్రం కొడుకింకెవుడికన్నా వుండాడా.... పన్జెయ్య కుండా సెట్టుకింద పండుకుంటే రెండేట్లు యేసిందానికే యిట్లయితే వూర్లో యింక రైతులు సేద్యాలు సేసుకున్నట్టే...." అన్నాడు చేతులూపుతూ వెంకటరెడ్డి.

"నువ్వట్టే సెప్పుతావు సామీ! ఆడ సూసినోల్లంతా 'అయ్యో. పాపం' అన్నోల్లే! యాడ్చి యాడ్చి కొట్టినావంటనే – మల్లా యాడ సూత్తే యిట్లంటావ్... కడగొట్టోడు... మొన్న సంకురాత్తిరికి వానికి పదారు దాటినాయి.. విది లేక వాన్ని జీతానికి పెడితే ఇట్ల సేసేదా సామీ.." అంటూ చీదడం మొదలు పెట్టింది మల్లక్క.

"అయిందేదో అయింది. దానికంతా యాడ రామాయనం బెట్టుకుంటే తెల్లారినట్టే– జరిగేదేదో సూడండి" అన్నాడు రామక్రిష్ణయ్య.

"ఇంగా జరిగేది యేంది సూడల్ల సామీ! పెండ్లి కెదిగిన కొడుకు కండ్లకు కనబడకుండ పొయ్యినంక. పెద్దోల్లు మీరన్నా నాలుగూర్లు యెతికిచ్చేటట్టు సూడండి. మా పెద్దోనికి వాని సంసారం యావ దప్ప యింగోటి పట్టదు. వాన్ని నమ్ముకొని శేనంతా కట్టపడి సేద్యం శేసుకున్నాము. రేపు రెండు సినుకులు పడితే యింట్లో వుండే రొవన్ని శెనిగిత్తనాలు యిత్తుకోవల్ల– "చెప్పుకు పోతున్నాడు కర్రోడు.

"ఓర కర్రోడా! వెంగట్రెడ్డి యవ్వారం పరిష్కారం సేద్దామని పంచాయితి కొస్తే నీ కష్టసుఖాలు చూడమంటావేమిరా! మీ మాదిగి నాయాల్లకు కాసింత పట్టాభూమి చిక్కినప్పట్నుండీ పట్టపగ్గాలు లేకుండా పోయాయిరా. అప్పుడే మాట్లాడే తీరే మారిపోయింది. పిర్రమింద బట్టలేని నాయాళ్ళంతా సేద్యాలు చేస్తారంట... సేద్యాలు .... ఏమప్పా వెంగట్రెడ్డీ! ఇదేమన్నా తెగేదా... పెట్టేదా..." అంటూ అసహనం ప్రదర్శించాడు రామిరెడ్డి.

"అదేదో మీరందరూ తేల్చల్లనే గదా యీ పంచాయితీ పెట్టింది. ఈ కర్రోనికి పది దినాలనుండీ చెప్తానే వుండా – యాడున్నా నీ కొడుకును యెతికి తీసకరమ్మని. నేను మాత్రం యెన్నాల్లని వూరికే వుండేది– నాకూ పనీపాటా, జరగల్లా వద్దా! కొత్త జీతగాన్ని పెట్టుకోవాల్లంటే టైమ్‌గాని టైమ్‌లో యిప్పుడెవరు చిక్కుతారు. మాట్లాడిస్తే జీతం గాక పైగా వెయ్యి, రెండువేలూ, వడ్డీ లేకుండా అప్పడుగుతా వుంటే యాడ తెచ్చిపెట్టేది? మీరూ సూస్తానే వుండారు గదా– ఇప్పటికే ముగ్గురు జీతగాళ్లని పెట్టుకొని యాదలేక సస్తావుండా– ఈటికే పని జరగడమే కష్టమై పోతావుంటే ఈ నా కొడుకు గుమ్ముకొని యాటికి పొయ్యినాడో యేమో! రెండు బనీన్లూ, పంచీ, దుప్పటీ కూడా యిప్పిచ్చుకున్నాడు. సేరిన్నాడే యీ కర్రోడు ఆ ముండమోపి పట్టాకు కరణమయ్యకియ్యల్లని ఐదు నూర్లిచ్చేదంకా వొగటే తిరగడం. తీరా యిచ్చిన నెల గూడా కాకుండానే యిట్ల జరిగింది. మాటిమాటికి 'నువ్వయి నువ్వు కొట్టి మా వాన్ని మాకు దక్కకుండా సేసినావో' అని యీ ముసిల్ది వొగటే రంపు. నేనేమన్నా

వొళ్లు తీవర మెక్కి కొట్టినానా? పనెగబట్టి వాని దోవన వాడు 'జరం జరమని' రెండ్రోజులు మల్లుకుంటే యేందోలే అనుకుండా. తీరా పనికొచ్చి సెట్టుకింద గుర్రుపెడితే ఎవురైతే మాత్రం వోర్చు కుంటారప్పా! అసలు కొట్టకపోతే మాటినే రకమా యీ నా కొడుకులు.....” చేతులూగిస్తూ చెపుతున్నాడు వెంకటరెడ్డి.

“అది సరే వెంగట్రెడ్డీ! యిదంతా వినిండే పురాణమే గదా! కర్రోని కొడుకు ఎప్పుడొస్తాడో ఏమో వానికే తెలీదు. అసలు పత్తా కూడా తేలలేదు. ఇంతకూ యిప్పుడు నువ్వేమంటావ్” అన్నాడు సుబ్బన్న.

“నేననేది యేముందీ... వాని కత యింక నాకు కాబట్టదు. వీళ్ళ చుట్టూ తిరగడం దప్ప నాకింకేం పన్లేదా! నాయవస్త లేవో నేను పడతాను. నేనిచ్చిన ఐదునూర్లూ నాకు వెంటనే యిప్పించి ఇదేదో పరిష్కారం సెయ్యండి” అన్నాడు వెంకటరెడ్డి.

“ఏంరా కర్రోడా! మీవాడింక ఎప్పుడొస్తాడో యెవుడు సూసినాడు? వెంగట్రెడ్డికి, ఆయప్ప యిచ్చిన లెక్క తిరిగి యిచ్చే మార్గం సూడు.” అన్నాడు రామిరెడ్డి.

కర్రోని ముఖం డీలా పడిపోయింది. ఏం మాట్లాడకుండా తల నేలకేసి కూచున్నాడు.

“ఏంరా. మూలి మిందేసుకొని కుచ్చుంటే నీతోపాటు మేమూ ఈడే పడుండల్లా– ఆచెప్పేదేదో చెప్పుకో– ” తొందర పెట్టాడు శివరామప్ప.

“కాదు స్వామీ! ఇప్పుడు మల్లా లెక్క దెచ్చి గట్టమంటే నేనింగ యా వూరికి పోవల్ల. మీకు తెలకుండా నా దగ్గిరేమన్నా ముడుపుందా. మా వాడు రాకుండా యాటికి పోతాడు. రొన్నాల్లు చూడండి నాయిన్నా” అన్నాడు దిగులుగా కర్రోడు.

“ఇదిగో నా దగ్గిర యింగ అదేం కుదరదు – సూడు రాంరెడ్డీ! నా కత నీకు తెలిందేమీ కాదు. పట్టినన్నాల్లూ వోపిక పట్టినాను – ఇంగ నాకు చాతగాదు–“ అన్నాడు వెంకటరెడ్డి.

రామిరెడ్డి కర్రోని ముఖంలోకి చూస్తూ “చూడు కర్రోడా! వెంగట్రెడ్డికి చెప్పే కత దాటిపోయింది. ఐదు నూర్లు నువ్వు యాడో ఒకచోట తెచ్చి యిచ్చి తీరాల్సిందే” అన్నాడు నిక్కచ్చిగా.

కర్రోడు రెండు చేతులూ పైకెత్తి “ఇట్ల సెప్తే యెట్లసామీ! నేనెవుర్ని అడిగేది? అడుగుతానే యెవురన్నా నాయట్లా వానికి యిచ్చే కాలమా యిది” అన్నాడు.

"నీకేం వాయ్! మొన్న బూసోదీన వారొచ్చువాల్లో" (భూస్వాధీన వారోత్సవాల్లో) మూడెకరాల పట్టా సంపాయించుకున్నావు..... ఒక గిత్త కూడా వుండల్ల–'అబ్బరంత' మాదిరి మాట్లాడుతావే" అన్నాడు పెద్దారెడ్డి.

"పట్టా వస్తానే పండగై పాయనా సామీ! దాని కోసం పడినవస్త పగోడికి కూడా వద్దు! ఆ కరణమయ్యకు యీ యైదేండ్లు సేసిన శాకిరీ సెప్పుకుంటే తీరేదిగాదు– యిదిగో యిదిగో అంటూనే యిన్నేల్లు పట్టింది. ఆయప్పకిచ్చిన దుడ్లు లెక్కబెట్టుకుంటే గుండె పగులుతాది. ఆ పట్టా పున్నెమా అని యాడ సూసినా అప్పులే! తీరా పట్టా వచ్చే ముందు కూడా వాల్లకీయల్ల వీల్లకీయల్ల అని మున్నూరు పీక్కుండాడు. యంగట్రెడ్డిచ్చిన లెక్కలో మున్నూరు కరణమయ్యకే యిచ్చుకుండా.... మిగిలిన లెక్కలో రొావన్ని శెనిగిబుడ్లు కొనుక్కుండాను.... ఆ రొావన్ని యిత్తనాలు యిత్తుకుందామని శేనంతా నానా అవస్తలూ పడి అదును సేసుకుంటే పిల్లోడిట్లా చేసినాడు. ముసిలి పానాలు యెన్నని పనులు సేసుకుంటాం సామీ! ఆటికీ మా పెద్దోడు అంతో యింతో సాయం సేసినాడు... నా తలకు మించిన అప్పులు సేసుకొని సచ్చిపోతండా నాయిన్నా యిట్లాంటప్పుడు మీరు నన్ను లెక్కదెచ్చి కట్టమంటే...." అంటూండగా కర్రోని కంఠం పూడుకుపోయింది.

"రొాండు వాన సినుకులు పడితే శెనిక్కాయేసుకుంటాం సామీ! పంట పండినంక అంతో యింతో సేతికొస్తే మీకీ కుండా యాటికి పోతాము..... ఇప్పటికిప్పుడు కావల్లంటే మా పానాలు తప్ప మా దగ్గిర యింకేంటి వుండాయి" అంది మల్లక్క నెత్తిమీద పెద్ద బండ పెట్టినంత బరువుగా!

"వాన రావల్ల.... యిత్తన మెయ్యల్ల... పంటపండల్ల.... దుడ్లు సేతికిరావల్ల... అయినట్లే.... ఇదేందో సామెత సెప్పినట్లుంది, మీ యవ్వారం చూస్తే! అదంతా యేం కుదర్దు! మీ కుండే కష్టాలు మాకూ వుండాయి. నా లెక్క మాత్రం నాకిప్పుడు తెచ్చి కట్టాల్సిందే" ఖచ్చితంగా చెప్పాడు వెంకటరెడ్డి.

"కావల్లంటే నాలుగు దినాలు టైమ్ తీసుకో.... అంతేగాని పంటకూ బాకీకి ముడిపెట్టొద్దు... ఏమప్పా వెంగట్రెడ్డీ...." అని రామిరెడ్డి వెంకట్రెడ్డి కేసి చూశాడు.

"నాలుగు దినాలంటే కాదంటానా నువ్వు సెప్పినంక" తల వూపుతూ అన్నాడు వెంకటరెడ్డి.

"నాలుగు దినాలు కాదు, నాలుగు నెల్లయితే మాత్తరం లెక్క నాకు దొరకల్ల గదా సామీ! నా కుతికి కొయ్యండిగాని యిట్లా కరాకండిగా మాత్తరం సెప్పకండి

సామీ! ముసిలి ముప్పున బద్దోన్ని సెయ్యకండి" అంటూ బతిమాలుకున్నాడు కర్రోడు–

"మరెట్లారా నీతో సచ్చేది! కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి లెక్కన మాట్లాడుతావు..... యిన్నాల్లయినా నీ కొడుకు రాకపోతే యీ యప్పుకిచ్చే లెక్కన్నా యీకపోతే ఎట్లా.... నీ శెనిక్కాయ పంటయెంత గాంగరా.... కొత్త సేద్దెం.... నువ్వేసే యాభైశేర్ల యిత్తనాలకు పండే పంట యాటికయితుంది..... ఆ పొద్దుకు మల్లా ఎన్ని కూతలు కూస్తావో. యిదంతా కుదిరే యవ్వారం గాదులే" అన్నాడు శివరామప్ప –

కర్రోడు ఏం మాట్లాడలేదు.

మల్లక్క తల నేలకేసి వుండిపోయింది.

వాళ్ళ తలమీద ఎండ చురుకు తగులుతోంది– అప్పటికి పొద్దు బాగా నడినెత్తికొచ్చింది. అంతవరకూ వాళ్ళ తలలమీద కొద్దిగా పడుతున్న వేప చెట్టు నీడ పక్కకు తప్పుకుంది. ఎండలో వీరు కూచున్నారన్న ఆలోచననైనా నీడలో కూచున్నవాళ్ళకు లేదు. లేచి నీడలో కూచోవాలన్న తలపు వచ్చి కూడా అట్లాగే కూచుండిపోయాడు కర్రోడు–

వెంకటరెడ్డి, రామిరెడ్డి ముఖంలోకి, యింకా అక్కడున్న అందరి ముఖాల్లోకి సాలోచనగా చూశాడు. రామిరెడ్డి సిగరెట్ తీసి వెలిగించాడు. పెద్దారెడ్డి వక్కాకు నములుతూనే వున్నాడు. సుబ్బన్న బీడీ కాలుస్తున్నాడు. రామిరెడ్డి రెండుసార్లు సిగరెట్ పీల్చి గుప్పుమని పొగ వదిలాడు.

"ఐతే లెక్క యివ్వటం నీకు బొత్తిగా వల్ల కాదన్న మాట" ఒక నిర్ణయానికి వచ్చి నట్లుగా కర్రోన్ని అడిగాడు రామిరెడ్డి.

"వూను స్వామీ" అన్నాడు కర్రోడు.

మళ్ళా అందరి మధ్య నిశ్శబ్దం అలుముకుంది – శివరామప్ప లేచి దూరంగా పొగాకు ఎంగిలి వుమిసి, ఒకటి రెండు నిమిషాలు రామిరెడ్డి ముఖంలోకి, వెంకటరెడ్డి ముఖంలోకి చూసి పంచాయితీ ఆఫీసులోనికి వెళ్ళాడు. రామిరెడ్డి తల పంకించి వెంటనే తానూ లోపలికి నడిచాడు. ఒక నిముషం తర్వాత వెంకటరెడ్డి కూడా లోపలకు దారి తీశాడు.

కర్రోడు, మల్లక్క వాళ్ళవేపే మోరలెత్తి చూస్తున్నారు. వీళ్ళంతా లోపలికి ఏం పని మీద వెళ్ళినట్టా అనుకుంటున్నాడు కర్రోడు. ఏదో నెత్తిమీద బెడతారు వీళ్లంతా అనుకున్నది మల్లక్క.

ఎండ చురుకు రానురాను ఎక్కువనిపిస్తోంది. ఇద్దరూ లేచి కాసింతజరిగి వేపచెట్టు నీడలో కూలబడ్డారు. ఆరిపోయిన బీడీని తీసి వెలిగించుకొని రెండు పీకులు పీకాడు కర్రోడు. బీడీ పీకుతున్నప్పుడు అతని చెంపలు అగాధమైన లోయల్లాగా అయ్యాయి.

పది నిమిషాల తర్వాత పంచాయితీ ఆఫీసు లోపల్నుండి వాళ్లు బయటకొచ్చి ఎవరి స్థానాల్లోవారు కూచొన్నారు.

రామిరెడ్డి తాపీగా మరో సిగరెట్ వెలిగించి జాగ్రత్తగా కర్రోని ముఖంలోకి చూస్తూ "సూడరా కర్రోడా! నువ్వెటూ వెంగటరెడ్డికి లెక్క యివ్వలేవని ఒప్పుకున్నావు గదా! నేనొక మాట చెబుతాను. వినుకుంటావా?" అన్నాడు.

కర్రోనికేదో ఆశలాంటిది కలిగింది. "చెప్పు సామీ.... చెప్పు.....మీ పెద్దోల్లు సెప్పేమాట నేనెప్పుడైనా కాదనేవాన్నా మీ దగ్గిర బతికేవాన్ని" అన్నాడు ఆత్రంగా.

రామిరెడ్డి కొద్దిగా లేచి కుర్చీ కాస్తా ముందుకు జరుపుకొని మళ్ళీ కూర్చుంటూ "భూస్వాధీన వారోత్సవాల్లో నీకొచ్చిన పట్టాభూమి యామాత్రముంటుందిరా?" అనడిగాడు.

"యెంత సామీ... మూడెకరాలకు తక్కువే వుంటుందేమో....." గుట్లూ నట్లూ పోతే యెగసాయానికి రెండెకరాలుంటుంది సామీ" అన్నాడు.

"శేనంతా బాగా అదును చేసుకుండావా...."

"ఈ నెల్రోజుల్నుండీ అదే పని గదా సామీ! దిన్నమూ పద్దన్నుండీ నేనూ, యిదీ దాంట్లో పొర్లాడుతుండామనుకో.... బాగా రాల్లన్నీ యేరిపోసి బూమిని అద్దమాకట్ల సేసుకుండాం సామీ. కట్టపడితే అంతో యింతో బతుక్కోవచ్చు గదా సామీ. నాకు యేరే పనిగాంగ యేముంది...." ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు కర్రోడు.

"ఈ ముసిలోనికి లేసినప్పట్నుండీ దాని సింతే సామీ– ఇంత ఆదరువు దొరికింది గదా అని వొకటే సంబడం" అంది మల్లక్క. ఆమె మనసులో యిదంతా యెందుకడుగుతున్నట్టా అనే చింత ఒకవైపు తొలుస్తూనే వుంది.

"సూద్రా– ముసిలి ముప్పున యీ అవస్తలన్నీ నువ్వేడబడుతావ్! కొత్త బిచ్చగాడు పొద్దెరడగడన్నట్టు నువ్వెప్పుదూ ఆ శేని మీద పడి చేసుకున్నా నీకు గిట్టేది మాత్రం ఏముంటుంది? కాబట్టి నేను చెప్పేది శ్రద్ధగా విను" – చాలా మెత్తగా అన్నాడు రామిరెడ్డి.

కర్రోనికేదో అనుమానం లాంటిది తగిలింది... 'యేమవస్తల్లే సామీ– పుట్టినప్పట్నుండీ పడుతున్నదే గదా...." అన్నాడు సమర్థించుకున్నట్లు–

"అదిగాదురా – వ్యవసాయాలంటే చేసే మాకు తెలుస్తుంది గాని చేరెడు భూమి వుండే నీకేం అనుభవంరా– నువ్వెట్లా వెంగట్రెడ్డి బాకీ యిప్పట్లో తీర్చలేవు.... కాబట్టి...."

కర్రోడింక ఆపుకోలేక పోయాడు.... "యేంది సామీ– యిట్లా చెప్పుతండావు. నా బూమిని ఆయప్ప కిమ్మంటావా" అన్నాడు వణికిపోతూ.

"నీ భూమి యెవురికి కావల్లరా– వెంగట్రెడ్డికేం బూమి లేదా! నీ బూమి నీకే వుంటుంది.... నువ్వు అప్పు తీర్చల్ల గదా – ఎప్పుడు తీరుస్తావని? నువ్వు తీర్చేదంకా ఆ బూమి చెక్కను వెంగట్రెడ్డికి యిడిసి పెట్టు. నువ్వు యియ్యాల్సిన లెక్కకు వడ్డీ వుండదు– వెంగట్రెడ్డి ఆ బూమిని వ్యవసాయం చేసుకుంటాడు. నువ్వెప్పుడు బాకీ తీరిస్తే అప్పుడు నీ భూమి నీదే....?"

అందరూ వూపిర్లు బిగబట్టి తలలు పక్కలకేసి కూర్చున్నారు. కాస్సేపటికి మల్లక్క ఎర్రి కేకెట్టింది.

కర్రోడు ఒక వూగు వూగి ముందుకు వొరిగాడు.

❖ **ప్రజాసాహితి, ఫిబ్రవరి 1979**